వారాహి అమ్మవారికి పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

జగద్గిరిగుట్ట: ప్రతీ సంవత్సరం ఆశాఢమాసంలో మగ్దూం నగర్‌లోని గుప్తా వారాహి అమ్మవారి నవరాత్రుల పూజలో భాగంగా శుక్రవారం 2వ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, అలంకరణ అర్చన తదితర పూజలు చేశారు. భక్తులు నవరాత్రుల దీక్షలు చేస్తారు. వచ్చే నెల 4వ తేదీన ఈ నవరాత్రులు ముగుస్తాయని, చివరి రోజు పూజలతో పాటు హోమం నిర్వహించిన తర్వాత దీక్ష విరమించనున్నట్లు వారు తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లలకు వైద్య శిబిరం



నిజాంపేట్: నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో అంగన్‌వాడీ సెంటర్లు 3, 4, 5లలో దాదాపు 100మంది చిన్నారులకు ఆశ్రయ ఆకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అష్టం సహకారంతో శుక్రవారం హియరింగ్ స్క్రీనింగ్ నిర్వహణ శిబిరాన్ని నిర్వహించారు. స్క్రీనింగ్ శిబిరంలో ముగ్గురికి వైద్య ఉపకరణాలు అవసరమని, వారికి త్వరలోనే ఉచితంగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సరిత, ఆడియాలజిస్ట్ ప్రవీణ్, ప్రాజెక్ట్ సమన్వయకర్త హరికృష్ణ, అంగన్‌వాడీ టీచర్‌లు భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ చిన్నారులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణకు కృషి చేయాలి

తెలంగాణ అటవీ దళాల అధిపతి డాక్టర్ సువర్ణ



శిక్షణ పూర్తి చేసుకున్న అటవీ క్షేత్రాధికారులు

సుభాష్‌నగర్: అడవుల పరిరక్షణకు శిక్షణ పూర్తి చేసుకున్న అటవీ సిబ్బంది క్షేత్రస్థాయిలో కృషి చేయాలని తెలంగాణ అటవీ దళాల అధిపతి డాక్టర్ సువర్ణ అన్నారు. శుక్రవారం దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 10వ బ్యాచ్ అటవీ క్షేత్రాధికారుల స్నాతకోత్సవం జరిగింది. 18 నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సువర్ణ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ శిక్షణలో మహారాష్ట్రకు చెందిన 32 మంది పాల్గొన్నారు. వారిలో 8 మంది మహిళలు ఉన్నారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభబరిచిన శుభం దశరథ్ ఇంగాలే, ప్రాచి అనిల్ రాందివే బంగారు పతకాలను సాధించారు. మరో 19 మంది బంగారు పతకాలు, ముగ్గురు వెండి పతకాలు పొందారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... నేడు అడవుల సంరక్షణలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా స్మగర్ల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు అటవీ ఉత్పత్తులు, చెట్లను పరిరక్షించేందుకు సమయస్ఫూర్తితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ అటవీ అకాడమీ సంచాలకులు డాక్టర్ ఎస్.జె.ఆషా, కోర్స్ డైరెక్టర్ ప్రవీణ, ఇతర అటవీ



ప్రతిభ కనబరిచిన శుభం దశరథ్‌కు మెడల్స్ అందజేస్తున్న అటవీ దళాల అధిపతి డా. సువర్ణ

లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో

జీడిమెట్ల పీఎస్‌కు మొదటిస్థానం

జీడిమెట్ల: లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించడంలో సైబరాబాద్‌లోనే జీడిమెట్ల పీఎస్ మొదటి స్థానంలో నిలిచింది. జీడిమెట్ల పీఎస్‌కు కమిషనరేట్ నుంచి 145 టార్గెట్ ఇవ్వగా..180 కేసులను పరిష్కరించేలా కృషి చేశారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో అత్యధికంగా 124 శాతం చేసి మొదటి స్థానంలో నిలిచారు. దీంతో బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. జీడిమెట్ల పీఎస్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, ఎస్ఐ రామచంద్రయ్య, హోంగార్డు రాజశేఖర్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, మోహన్‌లను సీసీ అవినాష్ మహంతి, డీసీపీ సురేష్‌కుమార్, ఏసీపీ నరేష్‌రెడ్డి అభినందించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్ మల్లేష్

పార్కులు అభివృద్ధి చేయాలని వినతి



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ బృందావన్ కాలనీలో పార్కులను అభివృద్ధి చేయాలని శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు సమ్మయ్య నేత ఉప కమిషనర్ నరసింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బృందావన్ కాలనీలో రెండు పార్కులున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదని, దీంతో పలు పర్యాయాలు ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకువచ్చామన్నారు. పార్కు స్థలం చుట్టూ ప్రహరీతో పాటు వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, గ్రీనరీని ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తేవాలన్నారు.

నిఘా.. నేల చూపు !

పట్టించుకోని అధికారులు

చింతల్: రాజుల సొమ్ము రాళ్లపాలు అన్న చందంగా మారింది అధికారుల పనితీరు. అనుకోని సంఘటనలు, నేరాల నిరూపణకు సీసీ కెమెరాలు పట్టుకొమ్మలు. అటువంటివి అధికారుల నిర్లక్ష్యం కారణంగా సీసీ కెమెరాలు నేలచూపులు చూస్తున్న పట్టించుకునేవారు కరువయ్యారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే దారిలోని మున్సిపల్ చౌరస్తా ఎదురుగా రెండు స్తంభాలకు సీసీ కెమెరాలు నేను చూపులు చూస్తున్నాయి. మున్సిపల్ చౌరస్తా రోడ్డు కుత్బుల్లాపూర్ నుంచి సుచిత్రకు వెళ్లేందుకు ఈ రోడ్డు ప్రధాన రోడ్డు. అంతేకాకుండా కుత్బుల్లాపూర్ గాజులరామారామారం జంట సర్కిళ్ల కార్యాలయాలకు వెళ్లి వచ్చే వాహనాలను సైతం కొంతమేర షూట్ చేస్తుంటాయి. కానీ ఈ సీసీ కెమెరాలు పనిచేయక కొన్ని రోజులు గడుస్తున్నాయి. సీసీ కెమెరాలు దిశ మార్చుకొని రోడ్డు వైపునకు చూస్తున్నా అధికారులకు పట్టడం లేదు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: మయూరి సబ్‌స్టేషన్ 11కేవీ ప్రశాంత్ నగర్ ఫీడర్‌లో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మయూరి నగర్ భాగం, ఆలయ సముదాయం, ఆర్ఎల్‌నగర్ రోడ్డు, వృద్ధాశ్రమం, ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2 ప్రాంతాలు, 11కేవీ రామ్ నరేష్ నగర్ ఓహెచ్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మిత్రాహిల్స్, ప్రశాంత్ నగర్, ఏఎస్ రాజు నగర్, వృద్ధాశ్రమం ప్రాంతాలు. 11కేవీ రామ్ నరేష్‌నగర్ కేబుల్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు హైదర్‌నగర్ గ్రామం, రామ్ నరేష్ నగర్, వెర్టెక్స్ ప్రెస్టేజ్, వెర్టెక్స్ ప్రివిలేజ్, వాటర్ వర్క్స్ దగ్గర, మెట్రో స్టేషన్ ప్రాంతాలు. 11కేవీ మయూరి నగర్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మయూరి నగర్, ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్డు, వృద్ధాశ్రమం ప్రాంతాలు అలాగే మియాపూర్ ఎక్స్ రోడ్స్ సబ్‌స్టేషన్ 11కేవీ శ్రీలా గార్డెన్స్ ఫీడర్‌లో ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు శ్రీలా గార్డెన్స్, ఎస్ఎంఆర్ వినయ్ నగర్, నడిగడ్డ తాండ, హెడీఎఫ్‌సీ బ్యాంక్ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

రోడ్డు నిర్మాణం ఆపాలని వినతి

కుత్బుల్లాపూర్: రోడ్డు నిర్మాణం ఆపాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జీడిమెట్ల లక్ష్మీగంగా ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘ ప్రతినిధులు సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలోని సెయింట్ ఆంథోని స్కూల్ నుంచి ఎన్నారెరువు కట్ట, జీడిమెట్ల గ్రామం మీదుగా లక్ష్మీగంగా ఎన్‌క్లేవ్ వరకు నూతనంగా 60 ఫీట్ల రోడ్డు మంజూరైందని, ఈ రోడ్డు నిర్మాణంలో జీహెచ్ఎంసీ అధికారులు పలు ఇళ్ల యజమానులకు గృహాలను కూల్చేందుకు నోటీసులు అందజేశారన్నారు. ప్రజలకు ఆస్తి నష్టం కలిగించడంతో పాటు ఇబ్బందులు సృష్టించే విధంగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని నరేందర్‌రెడ్డిని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ధమ్మని శ్రావణ్ కుమార్, నాయకులు సంజీవ రెడ్డి, అధ్యక్షులు రవీందర్ రెడ్డి, కౌశిక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణారెడ్డి, రాఘవేందర్ రావు, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న సురేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: హెలెన్ కెల్లర్ జయంతి ఉత్సవాలను శుక్రవారం సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలేసి కేక్ కట్ చేశారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ భవన్‌కు 50 కుర్చీలు, వాటర్ ఫిల్టర్ అందజేశారు. అనంతరం రిటైర్డ్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, సూరారం కాలనీ జడ్పీహెచ్ఎస్ ఆంగ్ల ఉపాధ్యాయుడు హనుమంతరావులు ఇటీవల పాఠశాలలో టెన్త్ పూర్తి చేసుకున్న నలుగురు విద్యార్థులకు దామోదర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆర్థిక సహాయంగా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, నార్త్‌సిటీ స్కూల్ కరస్పాండెంట్ వెంకటేష్, బ్రైట్ కాన్సెప్ట్ కరస్పాండెంట్ వినోద్, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజేంద్రప్రసాద్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్‌గౌడ్, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సంఘ అధ్యక్షుడు అంజయ్యగౌడ్, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, సత్యం, వెంకటరామయ్య, శేఖర్ గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

దుండిగల్: డి.పోచంపల్లి, సారెగూడెంలోని బంగారు మైసమ్మ దేవస్థాన 6వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాల మధ్య ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, డి.పోచంపల్లి మాజీ కౌన్సిలర్ ఎం.రాము గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు నాగరాజు, సదానందం, యాదగిరి, మశ్చందర్ రావు, కొల్తూరు మల్లేష్, శంకర్, రాజు, శ్రీశైలం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు..



పూజలో పాల్గొన్న కూన శ్రీశైలంగౌడ్

నేడు బీజేపీ సమావేశం

నిజాంపేట్: కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ చీకటి అధ్యాయానికి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా శనివారం ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్‌లో ఉదయం 8:30 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. శుక్రవారం బీజేపీ బాచుపల్లి అధ్యక్షులు బిక్షపతి, నిజాంపేట్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి ఓ ప్రకటన విడుదల చేశారు.